యువతకు ఉపాధి కోసం..

● శ్రీశైలంలో 4 నక్షత్రాల హోటల్‌ను సిద్ధం చేయాలని సీఎం ఆదేశం



పారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్

శ్రీశైలం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రానికి స్వామి, అమ్మవార్ల దర్శనార్థం వచ్చే యాత్రికులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడంతోపాటు, పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేసి యువతకు జీవనోపాధి అవకాశాలు పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం కనిగిరి పెద్దఈర్లపాడు నుండి వర్చువల్‌గా శ్రీశైలంలో నాలుగు నక్షత్రాల హోటల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. సుమారు 1.5 ఎకరాల స్థలంలో రూ. 83 కోట్ల వ్యయంతో 126 వసతి గదులు ఉండే హోటల్‌లో యాత్రికులకు సేవలందించడానికి, యువతకు ఉపాధి అవకాశం కల్పించేందుకు ఈ హోటల్ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. నిర్వాహకులు శ్రీ వెంకటేశ్వర గ్రూప్స్ అధినేత రామస్వామి వెంకటరమణ (సుందర్)ను మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి అభినందించారు. పరిశ్రమలు - ఉపాధికల్పనలో భాగంగా క్షేత్రంలోని అవుటర్ రింగ్ రోడ్డు సమీపంలో జరిగిన కార్యక్రమంలో మంత్రితోపాటు భూమి పూజలో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఈ హోటల్ ఏర్పాటుతో ప్రత్యక్షంగా 300 మందికి రోజువారి పనులతోపాటు హోటల్ మేనేజ్‌మెంట్, టెంపుల్ టూరిజం, హౌస్‌కీపింగ్, టూరిజం గైడ్స్ వంటి పలు విధాలుగా 1200 మందికి శాశ్వతంగా ఉపాధి కల్పన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఛైర్మన్ రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో నాగజ్యోతి, ఎమ్మార్వో శ్రీనివాసరావు, ఆలయ పీఆర్‌వో శ్రీనివాసరావు, సంస్థ నిర్వాహకులు సుందర్, రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

కరువు సీమలో పారిశ్రామిక ప్రగతి



బ్రాహ్మణకొట్కూరులో పరిశ్రమకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, కలెక్టర్ ఏ.సిరి

- రూ.3,262 కోట్ల పెట్టుబడులతో జిల్లాలో ఆరు పరిశ్రమలు
- 6,500 మందికి ఉద్యోగావకాశాలు
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో పలు పరిశ్రమలు
- మంత్రులు అచ్చెన్నాయుడు, టీజీ భరత్ శంకుస్థాపన

కర్నూలు/ఓర్వకల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక మార్పులతో కర్నూలు జిల్లా పారిశ్రామిక ప్రగతి సాధిస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆరు పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం వర్చువల్ ద్వారా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ పరిశ్రమల ద్వారా జిల్లాకు రూ.3,262 కోట్లకు పైగా పెట్టుబడులు రానున్నాయి. నిర్మాణాలు పూర్తి అయి కార్యరూపం దాల్చితే దాదాపుగా 6,500 మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ హబ్ పరిధిలో బ్రహ్మణపల్లి, గుట్టపాడు వద్ద 206 ఎకరాల్లో రూ.2,750 కోట్లు పెట్టుబడితో నిర్మించనున్న రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్ లిమిటెడ్, ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, సగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమలు ద్వారా 2,835 మందికి ఉద్యోగాలు లభిస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్థానికంగా పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కలెక్టర్ డాక్టర్ సిరి శిలాఫలకాలను ఆవిష్కరించారు. పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి, దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి గ్రామాల్లో 76.24 ఎకరాల్లో రూ.30.62 కోట్లతో అభివృద్ధి చేయబోతున్న ఎంఎస్ఎంఈ పార్కులకు కూడా సీఎం చంద్రబాబు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయంలో రూ.100 కోట్లతో ఏర్పాటు చేయబోతున్న మెల్‌స్టార్ ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేయగా, స్థానికంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఏపీ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ ప్రవీణ్ ఆదిత్య, జేసీ నూరుల్ కామర్ శిలాఫలకం ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలో రూ.97 కోట్లలో 1.2 ఎకరాల విస్తీర్ణంలో వెంకటేశ్వర లాడ్జీ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించే అధునిక హోటల్, రెస్టారెంట్‌కు నిర్మాణానికి సీఎం చంద్రబాబు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఎమ్మిగనూరు, ఆదోని ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, డాక్టర్ పార్థసారథి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... రాయలసీమ కరువు ప్రాంతం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమలు - మంత్రి టీజీ భరత్

రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే పరిశ్రమలు వస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఈ పరిశ్రమలు వల్ల స్థానికంగా యువతకు ఉపాధి కల్పించేలా ఇక్కడే స్కిల్ సెంటర్‌ను కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతి నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలు, స్కిల్ సెంటర్లను అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఉన్నారన్నారు.

(మిగతా 6లో..)

అహోబిలం హుండీ ఆదాయం రూ.69.80 లక్షలు



హుండీని లెక్కిస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో మంగళవారం లక్ష్మీనరసింహస్వామి హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అహోబిలం మఠం సీఈఓ సుందర రాజన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. నెల రోజులుగా ఎగువ అహోబిలం లక్ష్మీ నరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవారి ఆలయాలలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా రూ.69,80,203 ఆదాయం వచ్చినట్లు మఠం అధికారులు తెలిపారు.

స్థలాల పరిశీలన




సున్నిపెంటలో స్థలాలు పరిశీలిస్తున్న కలెక్టర్

శ్రీశైలం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మండల పరిధిని టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి చేస్తూ పర్యాటకరంగానికి అవసరమైన స్థలాలను కలెక్టర్ రాజకుమారి పరిశీలించారు. మంగళవారం సున్నిపెంటలో రెవెన్యూ అధికారులతో కలిసి పలు ప్రాంతాలను పర్యటించారు. ప్రధానంగా ఏపీ టూరిజం శాఖకు కేటాయించిన 49 ఎకరాలలో రానున్న హోటళ్లు, రిసార్ట్‌లు, పార్కులు, సాంస్కృతిక కేంద్రాలు వంటి మౌలిక వసతుల కల్పన చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చెస్తున్నట్లు చెప్పారు.

విద్యాభివృద్ధిపై మౌలానా ముద్ర

● ఎస్పీ సునీల్ షెరాన్



నివాళి అర్పిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య సమయంలో విద్యాభివృద్ధిపై మౌలానా అబుల్ కలాం అజాద్ చెరగని ముద్ర వేశారని ఎస్పీ సునీల్ షెరాన్ కొనియాడారు. మంగళవారం స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నప్పటినుంచి ఆయను చదువు, భాషలపై మంచి పట్టు ఉందని అన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, ఎస్పీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నలబై ఏళ్ల తర్వాత..



కొట్టాలచెరువులో గిరిజనులకు పంపిణీ చేసిన భూములు ఇవే

- గిరిజనులకు డీ-పట్టాలు తప్ప భూములు లేవు
- ఎక్కడబడితే అక్కడ సాగు చేసుకున్న వైనం
- రీసర్వేతో.. గిరిజనుల భూసమస్యలకు శాశ్వత పరిష్కారం
- నేడు కొట్టాలచెరువులో గ్రామసభ
- హాజరు కానున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా, కలెక్టర్ రాజకుమారి


ఆత్మకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల నుంచి ఉన్న కొట్టాలచెరువు గిరిజనుల సమస్యలు ఇక తీరనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రీ సర్వే ద్వారా కొట్టాలచెరువులో సమగ్ర సర్వే చేసి గిరిజనుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రెవెన్యూ అధికారులు ముందుకొచ్చారు. ఆత్మకూరు నుంచి సుమారు 40 కిమీల దూరంలో నల్లమల అంతర్భాగంలో పెచ్చెర్వు గూడెం ఉండేది. నల్లమలలో పులుల సంఖ్య ఆశాజనంగా ఉండటంతో 1983లో నల్లమల కేంద్రంగా నాగార్జునసాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్)ను ఏర్పాటు చేశారు. దీంతో నల్లమల లోపల ఉండే పెచ్చెర్వు వాసులను ఆత్మకూరు మండలంలోని కురుకుంద మజరా గ్రామమైన కొట్టాలచెరువు గూడేనికి తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1986లో పెచ్చెర్వులోని సుమారు 132 కుటుంబాలకు కొట్టాలచెరువు గ్రామంలో పునరావాసం కల్పించి ఒక్కో కుటుంబానికి ఐదు సెంట్ల ఇళ్ల స్థలంతో పాటు ఒక ఎకరా పొలాన్ని ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే తమకు ఒక ఎకరా భూమి సరిపోదని అదనంగా భూమి ఇవ్వాలని పెచ్చెర్వు గిరిజనులు ప్రభుత్వాన్ని కోరడంతో 1993లో ఒక్కో కుటుంబానికి రెండున్న ఎకరాల చొప్పున భూమి కేటాయిస్తూ.. డీ-పట్టాలను పంపిణీ చేశారు. ఇందు కోసం కొట్టాలచెరువులో 153 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు 240 ఎకరాల భూమిని ప్రభుత్వం అదనంగా కొనుగోలు చేసింది. అయితే ఆనాటి నుంచి నేటి వరకు గిరిజనులకు ఆ భూములు ఇవ్వలేదు. 41 ఏళ్లుగా తమ భూములు ఎక్కడ ఉన్నదీ పెచ్చెర్వు గిరిజనులకు తెలియదు.

ఎక్కడబడితే అక్కడ సాగు చేసువాల్సిన దుస్థితి :

కొట్టాలచెరువులో పునరావాసం పొందిన పెచ్చెర్వు వాసులకు అక్కడ బతుకుతెరువు కష్టమైపోయింది. ప్రభుత్వం ఇస్తానన్న భూమి కూడా ఇవ్వలేదు. ఆ భూములు ఎక్కడ ఉన్నదీ వారికి తెలియదు. ఆ భూములు నల్లమల సమీపంలో ఉండటంతో అడవిలో కలిసిపోయాయి. దీంతో వ్యవసాయ భూమి లేక కొంత మంది గిరిజనులు తిరిగి పెచ్చెర్వుకు వెళ్లారు. మరికొందరు మాత్రం గిరిజనులు తమకు అందుబాటులో ఉన్న అటవీ భూములను సాగు చేసుకోవాల్సి వచ్చింది. దీని వల్ల గిరిజనులు ఇంత కాలం చాలా ఇబ్బందులుపడ్డారు. ఇంతకూ వాళ్లకు ఇవ్వాల్సిన భూములు ఇవ్వలేదు. ఎట్టకేలకు రీసర్వే ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

రీ సర్వేతో.. అనుభవంలో ఉండే భూమికే హక్కు కల్పిస్తూ..

తమకు ప్రభుత్వం ఇవ్వాల్సిన భూములు ఎక్కడ ఉన్నాయో తెలియక గిరిజనులు ఎన్నో ఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్న భూమిని కాదని మరోచోట భూములను చూపిస్తే.. గిరిజనులు మరింత ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. అందువల్ల ఇంతకాలం వారు అనుభవిస్తున్న భూములకే హక్కు కల్పించాలని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం కొట్టాలచెరువు గ్రామంలో సమగ్ర రీసర్వే చేపట్టి గిరిజన లబ్ధిదారులకు తమ భూములను కేటాయించాలని ప్రణాళిక రూపొందించారు. కాగా 1993లో మొత్తం 132 గిరిజన కుటుంబాలకు భూపంపిణీ చేయగా ప్రస్తుతం 100 కుటుంబాలు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు తెలిసింది. మిగిలిన 32 మందికి సంబంధించిన వారసులు ఎవరైనా ఉన్నట్లయితే వారికి కూడా భూములు కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. దీనివల్ల గిరిజనుల భూసమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ఎక్కడైనా గిరిజనేతరులు భూములు అనుభవిస్తుంటే వాటిని గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు అవకాశం లేకపోలేదు.



నల్లమలలోని పెచ్చెర్వు చెంచుగూడేం ఇదే



నేడు కొట్టాలచెరువులో రీసర్వేపై గ్రామసభ

కొట్టాలచెరువు గిరిజనులను దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్యను రీసర్వే ద్వారా పరిష్కరించేందుకు బుధవారం గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామసభను ఏర్పాటు చేయనున్నారు. రీసర్వే ద్వారా జరిగే ప్రయోజనాల గురించి గిరిజనులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ రాజకుమారి హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి మండల రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లను సిద్ధం చేస్తోంది.

రీసర్వేతో గిరిజన భూములకు శాశ్వత పరిష్కారం



కొట్టాలచెరువు గ్రామంలో చేపట్టనున్న రీసర్వే ద్వారా గిరిజనుల భూములకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఇంతకాలం తమ భూమి ఎక్కడ ఉందో కూడా తెలియక గిరిజనులు అవస్థలు ఎదుర్కొన్నారు. రీసర్వే ద్వారా ప్రస్తుతం అనుభవంలో ఉండే భూములకే హక్కు కల్పించడం వల్ల ఆ సమస్య ఉండదు.

- రత్నరాధిక, తహసీల్దార్, ఆత్మకూరు



ఏసీబీకి పట్టుబడిన రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజా

ఏసీబీ వలలో ... డోన్ రీసర్వే డీటీ

- రూ.35వేలు లంచం తీసుకుంటూ దొరికిన అధికారి
- కేసు నమోదు, విచారిస్తున్న అధికారులు

డోన్ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డోన్ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సునీల్ రాజా లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. మంగళవారం డోన్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ సోమన్న, సీఐలు కృష్ణయ్య, శ్రీనివాసులు సిబ్బంది దాడి చేసి వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపిన వివరాల మేరకు వివరాలు.. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన దామ వేణుగోపాల్ డోన్ మండలంలోని జగదుర్తి గ్రామంలో సర్వే.నెంబర్.20-1, 20-బి2, 27-బీ2లలో పదెకరాల చుక్కల భూమిని పట్టా భూమిగా మార్చడానికి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదికను పంపడానికి డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజా రూ.60వేలు డిమాండ్ చేశారు. అయితే సదరు రైతుతో రూ.35వేలకు బేరం కుదుర్చుకున్నాడు. అది కూడా ఇవ్వడం ఇష్టం లేని రైతు దామ వేణుగోపాల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో మంగళవారం దామ వేణుగోపాల్ రూ.35వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజాను విచారిస్తున్నామని, విచారణ అనంతరం కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

మినుము పంటను దున్నేసిన రైతు



పంటను దున్నేస్తున్న రైతు

పాములపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతుల జాబితా సిద్ధం చేయాలని అధికారులను కూటమి ప్రభుత్వం ఆదేశించింది. కానీ మండలంలో వాగులు పొంగి నీటమునిగిన పంటలను మాత్రమే నమోదు చేస్మాని, మిగతా గ్రామాలలో నష్టపోయిన పంటల వివరాలు రాయమని అధికారులు చెప్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని క్రిష్ణరావుపేట గ్రామానికి చెందిన జనార్దన్ అనే రైతు ఐదు ఎకరాలలో రూ. 50 వేల పెట్టుబడి పెట్టి మినుము పంట సాగుచేశాడు. మొంథా తుఫాన్ కారణంగా పొలంలో వర్షపునీరు నిల్వ ఉండి పంట పూర్తిగా దెబ్బతిని కుళ్లిపోయింది. ఈ విషయం స్థానిక వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. మండలంలోని చెలిమిళ్ళ, లింగాల, ఇస్కాల గ్రామాల రైతుల పేర్లు మాత్రమే రాస్తున్నామని అధికారులు అన్నట్లు రైతు ఆవేదన చెందాడు

నేడు గవర్నర్ నజీర్ రాక



- ఆర్‌యూలో 4వ కాన్వకేషన్‌కు హాజరు
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు

కర్నూలు అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బుధవారం పర్యటించనున్నారు. రాయలసీమ యూనివర్సిటీలో నాల్గవ స్నాతకోత్సవం(కాన్వకేషన్)తో పాటు నగరంలోని మాంటిస్సోరీ పాఠశాల సిల్వర్‌జూబ్లీ వేడుకలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారు. ఈ మేరకు ఏర్పాట్లను జిల్లా అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ, సీఐలు పరిశీలించారు. రాయలసీమ వర్సిటీ వీసీ వి.వెంకటబసరావు పది రోజులుగా కమిటీలు, ప్రొఫెసర్లతో సమీక్షిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గవర్నర్ రాకతో ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా ప్రొఫెసర్లు, పోలీసులతో చర్చలు జరిపారు. స్నాతకోత్సవంలో భాగంగా 75 మందికి గవర్నర్ బంగారు పతకాలను అందజేస్తారు. 60 పీజీ, 15 ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ బంగారు పతకాలను ప్రదానం చేస్తారు. మరికొందరికి డాక్టరేట్, డిగ్రీ పట్టాలను అందజేస్తారు.

గవర్నర్ పర్యటన ఇలా: ఉదయం 10 గంటలకు విజయవాడలోని రాజ్‌భవన్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బయల్దేరుతారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి ఎయిర్ పోర్టుకు 10:30కి చేరుకుంటారు. 10:35కు రాయలసీమ యూనివర్సిటీకి చేరుకుంటారు. 11 నుంచి 12:15 వరకు జరిగే 4వ కాన్వకేషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:35కు నగర శివారులోని ఇండస్ స్కూల్‌కు, ఆ తర్వాత ఏ.క్యాంప్‌లోని మాంటిస్సోరీ సీనియర్ సెంకండరీ స్కూల్‌కు చేరుకుంటా రు. అక్కడ మధ్యాహ్నం 3:30 వరకు జరిగే గోల్డెన్ జూబ్లీ వేడుకలకు హాజరవుతారు. అనంతరం 4:30కు తిరుగు ప్రయాణమవుతారు.

న్యూమోనియాతో జాగ్రత్త 7

రేణిగుంటలో రోడ్డు ప్రమాదం
● కర్నూలుకు చెందిన తల్లీ కొడుకులు దుర్మరణం 7

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

హక్కుదారులకు స్థిరాస్తి కార్డులు



గ్రామ సభలో పాల్గొన్నప్రజలు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వామిత్వ సర్వే ఫేస్-2లో 73కుగాను 23 పంచాయతీలలో ఈ ప్రక్రియ పూర్తయిన వాటికి 9(2) కింద హక్కుదారులకు స్థిరాస్తికార్డులు అందజేయనున్నారు. ఈ మేరకు సోమవారం నుంచి ఈ నెల 22 వరకు డిప్యూటీ ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఆదోని డివిజన్‌లో 11 గ్రామ పంచాయతీలు, కర్నూలు డివిజన్‌లో 2 గ్రామ పంచాయతీలు, పత్తికొండ డివిజన్‌లో 10 గ్రామ పంచాయతీలు, గ్రామ కంఠాలలో ఇళ్ల స్థలాలకు ఆస్తి హక్కు సంబంధించిన కార్డులు అందజేయనున్నారు. హక్కుదారుడు సంబంధిత ఆస్తి హక్కుపై అభ్యంతరాలు ఉంటే 10(2) కింద సవరించుకునే అవకాశం కల్పించింది. గ్రామ సభ పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్, రెవెన్యూ అధికారి, డిజిటల్ అసిస్టెంట్లు ఆధ్వర్యంలో జరుగుతుంది. పరిష్కారం కానీ వి.ఫాం-19 ద్వారా అప్పీల్ చేసుకుని రీసర్వే కోసం డిప్యూటీ తహసీల్దార్‌కు పంపిస్తారు. ఆధార్, మొబైల్ నెంబర్, డాక్యుమెంట్లు మొదలైన వివరాలను సేకరించి డిజిటలీకరణ చేస్తారు. సభలో తీర్మానం చేసి గ్రామ సభ రిజిస్టర్లు నమోదు చేస్తారు. ఏదైనా కుటుంబానికి డాక్యుమెంట్లు లేకపోయినా, వారి ఆస్తి గ్రామకంఠంలో 12 ఏళ్లపాటు వారి ఆధీనంలో ఉన్నట్లు గుర్తిస్తే వారికి కూడా యాజమాన్య పత్రాలు అందజేస్తారు.

పీఎం ఉపకార వేతనాల

దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 9వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించకని వారి నుంచి పీఎం యశస్వి పథకం కింద ఉపకార వేతనాలు పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి ప్రసూన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి 9వ తరగతిలో మెరిట్ ప్రాతిపదికన ఎంపికైన విద్యార్థులకు ఒక సంవత్సరానికి రూ.75వేలు, ఉపకారవేతనాలు ఇస్తామని, 10వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపికైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒక సంవత్సరానికి రూ.1,25,000 ఉపకారవేతనాలు ఇస్తామని అన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15 చివరి గడువు అన్నారు. అర్హత కలిగిన విద్యాసంస్థల జాబితా, ఇతర వివరాల కోసం అప్లయ్ చేసుకోవడానికి స్కాలర్‌షిప్స్‌జీవోవి.ఇన్‌వెబ్‌సైట్‌లో అనుసరించాలన్నారు.

కష్టపడితే ఉపకార వేతనం



చాగలమర్రి బాలికల పాఠశాలలో ఎన్ఎంఎంఎస్‌పై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం శివలక్ష్మి

చాగలమర్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): **చదువులో ప్రతిభ ఉన్నా ఆర్థిక పరిస్థితులు బాగోలేక కొందరు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఇలాంటి వారికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోంది. ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో అర్హత సాధిస్తే 4 ఏళ్ల పాటు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఈ ఆర్థిక ప్రయోజనం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నంద్యాల జిల్లాలో గత ఏడాది 4,800 మంది దరఖాస్తు చేసుకోగా ఈ ఏడాది 3,932 మంది దరఖాస్తు చేసుకున్నారు. నెల రోజులు కష్టపడితే 4 ఏళ్ల పాటు స్కాలర్‌షిప్ అందుతుంది. ఆయా పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించి ఎన్ఎంఎంఎస్ సాధించేందుకు తీర్చిదిద్దుతున్నారు.**

● ప్రతిభ చాటితే 4 ఏళ్ల పాటు అందజేత

● ఏడాదికి రూ.12 వేలు

పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నెలకు రూ.1,000 చొప్పున ఏడాదికి రూ.12 వేలు అందజేస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఆర్థిక సాయం కొనసాగుతుంది.

● బహుళైచ్ఛిక ప్రశ్నల విధానంలో

బహుళైచ్ఛిక ప్రశ్నల విధానంలో 180 ప్రశ్నలు ఉంటాయి. మెంటల్ ఎబిలిటి(మ్యాట్), స్కాలాస్టిక్ ఎబిలిటి(శాట్), 7, 8 తరగతుల సైన్స్, గణితం, సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది.



● డిసెంబరు 7న పరీక్ష

ప్రభుత్వం ప్రతి ఏడాది నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఇందుకు అర్హులు. డిసెంబరు 7న పరీక్ష నిర్వహిస్తారు. ఇంకా నెల రోజులు సమయం ఉంది. గత పరీక్షలో విజయం సాధించిన వారి అనుభవాలను పరిగణలోకి తీసుకొని కొద్దిగా కష్టపడి చదివి ప్రతిభ చూపితే 4 ఏళ్ల పాటు ఉపకార వేతనం అందుతుంది.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యాను



చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. 8వ తరగతి చదువుతున్న సమయంలో పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ శిక్షణ పొందడంతో పాటు ఉదయం, సాయంత్రం గణితంపై సాధన చేశా. సందేహాలను ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకున్నా. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యాను. ఇప్పుడు ప్రతి నెలా రూ.వెయ్యి స్కాలర్‌షిప్ అందుతోంది.

- షేక్.మహ్మద్ మున్వర్‌బాషా, 9వ తరగతి

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



మా పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్‌కు 27 మంది విద్యార్థులతో మొదటిసారి దర ఖాస్తు చేయించాం. వీరికి ప్రతి రోజు ప్రత్యే క తరగతులు నిర్వహిస్తున్నాం. నమూనా ప్రశ్నపత్రాలతో పరీక్షకు సిద్ధం చేస్తున్నాం. మంచి ఫలితాలే లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

- శివలక్ష్మి, హెచ్ఎం, బాలికోన్నత పాఠశాల, చాగలమర్రి

పేద విద్యార్థులకు చేయూత



చిన్నపాటి శిక్షణతో ఉపకార వేతనాలకు ఎంపిక కావచ్చు. విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలి. పరీక్షల్లో ప్రతిభ చూపితే 4 ఏళ్ల పాటు ఆర్థిక చేయూత లభిస్తుంది.

-అనూరాధ, ఎంఈఓ, చాగలమర్రి

కరువు సీమలో పారిశ్రామిక ప్రగతి

5వ పేజీ తరువాయి



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

అదే జరిగితే పలు కెమికల్ పరిశ్రమలు వస్తాయన్నారు. రూ.23 వేల కోట్లతో సెమికండక్టర్స్ పరిశ్రమ, రూ.7వేల కోట్లతో ఆగస్త్య సోలార్ యూనిట్ ఏర్పాటు జరగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ డా.సిరి మాట్లాడుతూ ఆరు ప్రాజెక్టులు, మూడు ఎంఎస్ఎంఈ పార్కులు ముఖ్యమంత్రి సమక్షంలో శంకుస్థాపన చేశారన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ వేగంగా అభివృద్ధి చెందుతుందని, వచ్చే పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చేలా మంత్రి టీజీ భరత్ చొరవ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సందీప్ కుమార్, ఏపీఐఐసీ జడ్ఎం మధుసూదన్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, రిలయన్స్ సంస్థ ప్రతినిధి అర్పన్ బసు, కిషన్‌పారిశ్రామికవేత్త సుబ్బారెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో నాగ అనుసూయ, నాయకులు మోహన్ రెడ్డి, గోవిందరెడ్డి, సుధాకర్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, చంద్రపెద్ద స్వామి, బ్రాహ్మనపల్లెనాగిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

● పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పన

- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ఓర్వకల్లు పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేస్తున్న మెల్‌స్టార్ ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయగా, మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజర్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వాణిజ్య ప్రైవేటు పైలట్లకు శిక్షణ ఇచ్చే ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ డీజీసీఏ ఆమోదిత కోర్సులు, కమర్షియల్ పైలట్ లైసెన్స్ ప్రైవేటు లైసెన్స్ మల్టీ ఇంజన్ రేటింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ తదితర కోర్సుల్లో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా వంద మందికి, పరోక్షంగా 250 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. వచ్చే ఏడాది జూలై నాటికి నిర్మాణాలు పూర్తి చేసి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మెల్‌స్టాల్ లిమిటెడ్ డైరెక్టర్ కష్యప్, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, డీఐవో ప్రవీణ్ రెడ్డి, డీఈ అమృత్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు

శ్రీశైలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న వీరికి పాలకమండలి చైర్మన్ రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రాకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలు, స్వామివారి జ్ఞాపికను అందజేశారు.



స్వామివారి దర్శనం అనంతరం వస్తున్న మంత్రి బీసీ దంపతులు

లక్ష్యాన్ని అధిగమించాలి

ఆళ్లగడ్డ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి వీఓ తమ లక్ష్యాన్ని మార్చి నాటికి పూర్తి చేయ్యాలని పోస్టల్ సూపరింటెండెంట్ అప్పలస్వామి కోరారు. మంగళవారం స్థానిక పోస్టాఫీసును జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ అప్పలస్వామి అకస్మికంగా తనిఖీ చేశారు. ఒక సంవత్సరం రికార్డులను పరిశీలించారు. అనంతరం సబ్‌డివిజన్‌లోని పోస్ట్ మాస్టర్స్‌తో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామనాథ్, పోస్ట్ మాస్టర్ గురువ య్య, జాకీర్ హుసేన్, కరిముల్లా పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపకార్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే నబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆద్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రోలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జోహరాపురం వద్ద హంద్రీనదిలో మంగళవారం గుర్తుతెలియని మృతదహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు 40-45 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. శరీరంపై లేత నీలిరంగు ప్యాంటు, క్రీం కలర్ షర్టు ఉంది. శరీరం పూర్తిగా ఉబ్బిపోయింది. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 9121101059 నెంబర్‌కు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉల్చాల గ్రామానికి చెందిన రఘువరన్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. ఓ ప్రైవేటు కంపెనీలో రికవరీ ఏజెంటుగా పని చేస్తున్నాడు. కంపెనీకి సంబంధించిన డబ్బులు వాడుకుని, తిరిగి కట్టలేక మనస్తాపానికి గురై సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

అంకిరెడ్డి పల్లెలో మరో యువకుడు..



దాసరి కార్తీక్ (ఫైల్)

కొలిమిగుండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలం లోని అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దాసరి కార్తీక్(23) మంగళవారం తన పుట్టిన రోజునే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కార్తీక్ అగ్రికల్చర్ విద్యనభ్యసించి ఇంటి వద్దే ఉంటున్నాడు. 2016లో తల్లి మరణించిన తర్వాత తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. తండ్రి దాసరి శ్రీనివాసులు గతంలో సమరసత జిల్లా ధర్మ ప్రచారక్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆరెస్సెస్‌లో జిల్లా కార్యవాహ విధులు నిర్వహిస్తున్నారు. జీవితంపై విరక్తి చెందిన కార్తీక్ మంగళవారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో పైకప్పు దంతెకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



వృద్ధురాలిని పోలీసులకు అప్పగిస్తున్న యువకులు

బండిఆత్మకూరు నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ అనే 68 ఏళ్ళ వృద్ధురాలు కుందూనదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మంగళవారం జరిగింది. ఈ ఘటనను చూసిన బండి ఆత్మకూరు యువకులు ఫిదా, సూరజ్, శీను, అఫ్రోజ్ నదిలోకి దూకి కొట్టుకుని పోతున్న ఈశ్వరమ్మను ఒడ్డుకు చేర్చారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసికెళ్లారు. అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్లు తెలుస్తోందని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఆమె సోదరుడు కృష్ణారెడ్డికి వృద్ధురాలిని అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

అధికారులు పట్టించుకోలేదని మాజీ జవాను...

నంద్యాల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ ఆవరణలో మంగళవారం మాజీ జవాను శ్రీనివాసులు ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. జగజ్జననీ నగర్‌కు చెందిన మాజీ జవాన్ శ్రీనివాసులు ఇంటి ఎదురుగా ఒక వ్యక్తి అక్రమంగా ముందుగా వచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీనిపై జవాను పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ వారు పట్టించుకోకపోవడంతో విసిగిపోయిన జవాను మంగళవారం మున్సిపాలిటీ ఆవరణలో విష ద్రావణం తాగి ఆత్మహత్య యత్నం చేశాడు. స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

ముగ్గురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన గుండ్ర గొల్ల ఎల్లమ్మపై దాడి ఘటనలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సి.ఐ రమేష్‌బాబు వెల్లడించారు. గొల్ల యల్లమ్మ భర్త చౌడయ్యకు చెందిన పొలం వారి కూతుర్లు కౌలుకు ఇచ్చిన విషయంలో గొడవ పడగా అదే గ్రామానికి చెందిన గొల్ల బాలయ్య, నాగలక్ష్మి, కళావతి దాడి చేశారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- ఉమ్మడి జిల్లాలోని 57 గ్రంథాలయాల్లో వారం రోజులు విభిన్న కార్యక్రమాలు
- గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి వి. పెద్దక్క



కర్నూలు కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటూ, ఉమ్మడి జిల్లాలోని అన్ని శాఖ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి వి.పెద్దక్క తెలిపారు. మంగళవారం పాతనగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాల్లో రోజువారీ కార్యక్రమాల వివరాలుల ఆమె వెల్లడించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటు ఉమ్మడి జిల్లాలోని 57 శాఖా గ్రంథాలయాల్లో, 133 పుస్తక నిక్షిప్త కేంద్రాల్లో ఈ వారోత్సవాలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు ఆమె వివరించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో 14న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ, అనంతరం మాజీ ప్రధాని పండిట్ నెహ్రూ, గ్రంథాలయ పితామహుల చిత్రపటాలకు పుష్పాలంకరణ, ఉదయం 11 గంటలకు విద్యార్థులతో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ర్యాలీ ఉంటాయని తెలిపారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, జేసీ నూరుల్ ఖమర్, మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు కేసీ కల్కూర, కేజీ గంగాధరరెడ్డి హాజరవుతారని తెలిపారు. తొలిరోజున బాలల దినోత్సవం, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని ఆమె తెలిపారు. 15న పుస్తక ప్రదర్శనలు, పురాతన నాణెముల ప్రదర్శన, అవగాహన సదస్సులు ఉంటాయి. మధ్యాహ్నం 2 గంటలకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. 16న గ్రంథాలయ ఉద్యమ పితామహుల సంస్మరణ, 17న చిత్రలేఖన పోటీలు, కవి సమ్మేళనాలు, సాహితీ సదస్సులు, రచయితల సందేశాలు, 18న విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, వివిధ రకాల ఆటల పోటీలు, 19న క్విజ్ పోటీలు, మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు వేడుకలు, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుంది. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాషా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

న్యుమోనియాతో జాగ్రత్త

- చిన్నారులు సతమతం
- జీజీహెచ్‌లో ఏటా 1,500 కేసులు
- నేడు వరల్డ్ న్యుమోనియా నివారణ దినం



కర్నూలు హాస్పిటల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చలికాలం వచ్చిందంటే చాలా మంది చిన్న పిల్లల్లో న్యుమోనియా వ్యాధి లక్షణాలు కనవడుతున్నాయి. చలి తీవ్రత పెరిగే కొద్ది ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. తరచూ జలుబు, దగ్గులతో అలసిపోతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. జలుబు దగ్గు, జ్వరంతో పాటు ఆయాసం ఎక్కువైతే అది న్యుమోనియా వ్యాధికి దారి తీయొచ్చు. న్యుమోనియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు. ఈ వ్యాధి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏకంగా 26 లక్షల మంది చనిపోగా, ఇందులో 7 లక్షల మంది చిన్నారులు ఉన్నారు. న్యుమోనియాను పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో చైల్డ్ న్యూమోనియాకు వ్యతిరేకంగా గ్లోబల్ కోయలిషన్-2009 నవంబరు 12న మొదటిసారిగా వరల్డ్ న్యుమోనియా డేను నిర్వహించింది.

న్యుమోనియా బ్యాక్టీరియా లేదా వైరస్ కారణంగా ఊపిరితిత్తులకు సంక్రమించే వ్యాధి. ఊపిరితిత్తుల్లోని గాలి గదుల్లోకి బ్యాక్టీరియా లేదా వైరస్‌తో నిండిన ద్రవ పదార్థం చేరడం వల్ల శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఇన్‌ఫెక్షన్‌కు కారణమయ్యే సూక్ష్మ క్రిమి రకాన్నిబట్టి వ్యాధి ప్రభావం ఉంటుంది.

లక్షణాలు ఇవీ..

న్యుమోనియాకు గురైన వారిలో దగ్గు, జ్వరం, జలుబు లక్షణాలు ఉంటాయి. జ్వరంతో పాటు ఆయాసం ఎక్కువ కావడం, శ్వాస కోశంలో నొప్పి, ఛాతీ భాగంలో నొప్పి, తలనొప్పి, ఆక్సిజన్ స్థాయిలో హెచ్చుతగ్గులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో వికారం, వాంతులు, విరేచనలు కలుగుతాయి. తొలి దశలో ఉన్నప్పుడు గుర్తించి సరైన చికిత్స చేసుకోవాలి.

పీసీవీతో చెక్



ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రొటీన్ ఇమ్యూనైజేషన్‌లో భాగంగా 6 వారాలు, 14 వారాలు, 9వ నెల వయస్సులో చిన్నారులకు మూడు డోసుల పీసీవీ వ్యాక్సిన్ ఇస్తున్నారు. ఇది భవిష్యత్తులో చిన్నారులకు న్యుమోనియా రాకుండా అడ్డుకుంటోంది. దీంతో పాటు న్యూమోనియా వచ్చిన చిన్నారులను, ఆశా, ఏఎన్ఎంలు గుర్తించి వారికి దగ్గు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే దగ్గు సిరప్ ఇస్తారు..

ఉమ్మడి జిల్లాలో 7వేల మంది..

ఉమ్మడి జిల్లాలో ఏటా 7వేల మంది చిన్నారులు న్యుమోనియాతో బాధపడుతున్నారు. 2025 కర్నూలు జీజీహెచ్‌లో జనవరి నుంచి ఇప్పటి వరకు 910 మంది చిన్నారులు న్యూమోనియాతో అడ్మిట్ అయ్యారు. ఇక నంద్యాల జీజీహెచ్, ఆదోని ఏరియా ఆసుపత్రుల్లో కూడా పీఐసీయూ, ఎన్ఐసీయూ యూనిట్లలో చిన్నారులు న్యూమోనియాతో చికిత్స తీసుకుంటున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో 7వేల మంది ఈ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

ఏడాదిలోపు చిన్నారుల్లో ఎక్కువ



కర్నూలు జీజీహెచ్‌లో ఏడాదిలోపు పిల్లలు ఎక్కువగా న్యుమోనియాలక్షణాలతో బాధపడుతూ పీఐసీయూ, ఎన్ఐసీయూలో చేరుతుంటారు. వీటిలో వంద శాతం, 5 శాతం మరణాలు ఉంటాయి. న్యూమోనియా లక్షణాలు కనబడగానే వెంటనే వైద్యులను సంప్రదించి ఆసుపత్రిలో చేరాలి. నెలలోపు చిన్నారులను ఎన్ఐసీయూ, నెలపైబడి చిన్నపిల్లలను పీఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నాం. **- డా.బి. విజయానందబాబు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, చిన్న పిల్లల విభాగం, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి**

సకాలంలో చికిత్స అందించాలి



న్యుమోనియా సాధారణంగా చిన్న పిల్లల్లో ఎక్కువగా వస్తుంది. దగ్గు, ఆయాసం, జలుబు, జ్వరం లక్షణాలు కనిపిస్తాయి. చిన్నారుల్లో చాతీనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలి. బ్యాక్టీరియా కారణంగా సోకే న్యూమోనియాకు యాంటి బయాటిక్స్ ద్వారా చికిత్స అందించవచ్చు. **- డా.కే. సింధూర రెడ్డి, కన్సల్టెంట్ పీడియాట్రీషన్, కర్నూలు మెడికవర్ హాస్పిటల్**

అండర్ ఫైవ్ కిల్లర్



భారతదేశంలో న్యుమోనియాను అండర్ ఫైవ్ కిల్లర్‌గా పిలుస్తున్నారు. జ్వరం, దగ్గు నిమిషానికి 50, 60 సార్లు ఎక్కువగా ఊపిరి తీసుకోవడం, ఛాతి ఎముకల ఎగురవేయడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. ముఖ్యం గా న్యుమోనియా ఉన్నవారిలో జ్వరం ఉంటుంది. ఆ సమయంలో తడిగుడ్డలతో తుడవడం మంచిది కాదు. **- డా.జి. సుధాకర్, సినియర్ పీడియాట్రీషన్ కిమ్స్ హాస్పిటల్, కర్నూలు**

వలస వెళ్లి మృత్యు ఒడికి..

- ఆర్లబండ, మూగలదొడ్డి వలస కూలీలు మృతి
- గ్రామాల్లో విషాద ఛాయలు



దుద్ది హరికృష్ణ (ఫైల్)



వెంకటరెడ్డి (ఫైల్)

కోసిగి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బతుకుపోరాటంలో వలసవెళ్లిన రెండు కూలీల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కోసిగి మండల పరిధిలోని ఆర్లబండ గ్రామానికి చెందిన దుద్ది హనుమంతు, వీరారెడ్డి దంపతుల కుమారుడు దుద్ది హరికృష్ణ (22) నెల రోజుల క్రితం తెలంగాణకు పత్తి పొలాల్లో పని చేయడానికి వలస వెళ్లాడు. అయితే సోమవారం సాయంత్రం పత్తి పొలంలో పని చేస్తూ స్పృహ కోల్పోయి అక్కడే మృతి చెందాడు. హరికృష్ణ మృతదేహాన్ని తోటి కూలీలు, కుటుంబ సభ్యులు గ్రామానికి తీసుకువచ్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. అదేవిధంగా మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామానికి చెందిన బోయ వెంకటరెడ్డి (25) మూడు నెలల క్రితం భార్య మహేషమ్మతో కలిసి ముగ్గురు పిల్లలను వెంట పెట్టుకుని తిరుపతిలో సిమెంటు పనికి వెళ్లాడు. సోమవారం సాయంత్రం పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా.. వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అక్కడే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తిరుపతి పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. బుధవారం వెంకటరెడ్డి అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. ఒకరోజులోనే ఇద్దరు యువ కూలీలు వలసవెళ్లి మృత్యు ఒడికి చేరడంతో కోసిగి మండలంలోని ఆర్లబండ, మూగలదొడ్డి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పొట్టచేత పట్టుకుని వలస వెళ్లి మృత్యుఒడికి చేరడంతో వారి కుటుంబాల్లో విషాదం అలముకుంది.

రేణిగుంటలో కారును ఢీకొన్న లారీ

- కర్నూలుకు చెందిన తల్లీ కొడుకులు దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు
- స్వల్పగాయాలతో బయటపడిన చిన్నారి




గాయాలతో బయటపడిన త్రిషిక, దివ్య

రేణిగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. రేణిగుంట సమీపంలోని ఓ మలుపు వద్ద అదుపు తప్పిన లారీ.. కారును ఢీకొన్న ఘటనలో కర్నూలు నగరానికి చెందిన తల్లీకొడుకులు చంద్రభాను సింగ్, సరస్వతీ బాయిలు దుర్మరణం పాలయ్యారు. కోడలికి తీవ్రగాయాలు కాగా, మనవరాలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మంగళవారం తెల్లవారుజామున రేణిగుంట- కడప మార్గంలోని చైతన్య పురం క్రాస్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. రేణిగుంట సీఐ జయచంద్ర తెలిపిన మేరకు వివరాలు... కర్నూలు నగరానికి చెందిన చంద్రభాను సింగ్ చెన్నైలోని మెడికల్ ఏజెన్సీలో బిజినెస్ మేనేజర్. ఆయన భార్య దివ్య చెన్నైలోనే బరోడా బ్యాంక్ రీజినల్ ఆఫీసర్. వారాంతపు సెలవులు కర్నూలులో గడిపారు.

సోమవారం సాయంత్రం కర్నూలు నుంచి కారులో తన తల్లి సరస్వతిబాయి, భార్య దివ్య, కుమార్తె త్రిషికతో కలిసి చంద్రభాను సింగ్ చెన్నై బయలుదేరారు. మంగళవారం తెల్లవారుజామున రేణిగుంట మండలం చైతన్యపురం క్రాస్ వద్దకు కారు చేరుకుంది. అదే సమయంలో రేణిగుంట నుంచి కడప వెళ్తున్న లారీ మలుపు వద్ద అదుపుతప్పి కారుని ఢీకొంది. కారు నడుపుతున్న చంద్రభాను సింగ్ (37) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పక్కన కూర్చున్న భార్య దివ్యకు రెండు కాళ్లు విరగడంతో పాటు తలకు ఓవైపు తీవ్రగాయాలయ్యాయి. వెనక సీటులోని సరస్వతి బాయి(60) తలకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవింగ్ సీటుకు వెనుక కూర్చున్న కుమార్తె త్రిషిక స్వల్పగాయాలతో బయటపడింది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అనంతరం వాహనంలో క్షతగాత్రులను తరలిస్తుండగా మార్గమధ్యంలో సరస్వతిబాయి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దివ్య పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ నాగరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనానికి నిప్పు.. దెబ్బతిన్న కారు

కొలిమిగుండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడి గ్రామంలో ఇంటి వద్ద పార్కు చేసిన ఉన్న కారుకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. గ్రామానికి చెందిన పోలు సురేష్ తన బొలేరో వాహనాన్ని తమ పశువుల షెడ్డు వద్ద పార్కింగ్ చేసి టార్పాలింగ్ కప్పి ఉంచాడు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు వాహనానికి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో కారుకు కప్పిన టార్పాలింగ్ పూర్తిగా కాలిపోగా కారు పాక్షికంగా దెబ్బతిన్నట్లు కొలిమిగుండ్ల సి.ఐ రమేష్‌బాబు వెల్లడించారు. ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



దెబ్బతిన్న కారును పరిశీస్తున్న సీఐ

అబుల్‌కలాం ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తూ..



వేదికపై నృత్యం చేస్తున్న విద్యార్థులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత దేశ అభివృద్ధికి పునాది వేసిన మహనీయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా పట్టణంలోని అబుల్ కలాం స్థూపం దగ్గర జేసీ నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ టౌన్ హాల్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవంలో జేసీ పాల్గొన్నారు. అబ్దుల్ కలాం స్వాతంత్ర్య పోరాటంలో తమ ఆలోచనతో అజరామరమైన సేవలందిచారన్నారు. అల్-హి-లాల్ దినపత్రిక ద్వారా స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రజల్లో నింపారని వివరించారు. నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ దేశంలో శాస్త్ర, సాంకేతిక విద్య అభివృద్ధికి, ఉన్నత విద్య సంస్థల ఏర్పాటుకు అబుల్ కలాం ఆజాద్ బలమైన పునాదులు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీఈవో జనార్దన్‌రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, మెప్మా పీడీ వెంకటదాస్, డియోసెస్ బిషప్ రెవ.సంతోశ్ ప్రసన్నరావు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఖలీల్, ఉర్దూ డీఐ అస్మదుద్దీన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు వాట్సాప్ గ్రూపు



ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీ సెక్రటరీ చంద్రమౌళి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లో తాము పండించిన పత్తిని అమ్ముకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. రైతుల కష్టాలను గుర్తించిన ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ చంద్రమౌళి రైతులకు వివిధ యాప్‌ల వివరాలను అందించేందు కోసం ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. ఈ గ్రూపులో రైతులందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రచారాన్ని చేశారు.

వ్యక్తి అరెస్టు

- రిమాండ్‌లో త్రీ టౌన్ పోలీసులకు చుక్కెదురు

నంద్యాల టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి బొగ్గరపు నాగరాజును అరెస్టు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన వ్యాపారి మను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే వీరి ఇద్దరి మధ్య వ్యాపార లావాదేవీలు ఉన్నట్లు తెలిపారు. దీంతో విచారణ చేసి సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండును తిరస్కరించింది. దీనిపై బొగ్గరపు నాగరాజు, ఆయన తరపున న్యాయవాది మాట్లాడుతూ.. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా త్రీటౌన్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసినట్లు ఆరోపించారు. దీంతో కోర్టు త్రీటౌన్ పోలీసులకు రిమాండును తిరస్కరించింది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: డీఎల్‌డీవో


పగిడ్యాల సచివాలయంలో వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌వో

పగిడ్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీవో అన్వరా బేగం హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని సచివా లయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు వివరా లు, సర్వేల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనతరం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. డీఎల్‌వో మాట్లాడుతూ సచివాలయల పరిధిలో స్వామిత్వ, కౌసల్యము సర్వేలను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో కార్యాలయ సిబ్బంది నాగేంద్ర కుమార్, పంచాయతీ కార్యదర్శి వీరన్న యాదవ్ ఉన్నారు.

రుణాలు వసూలు చేయాలి


మాట్లాడుతున్న స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నాగప్రసాద్

జూపాడుబంగ్లా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్త్రీనిధిలో తీసుకున్న రుణాలను వసూలు చేయాలని స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నాగప్ర సాద్ అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో స్త్రీనిధి అప్పులు వసూలుపై వీవోఏ, సీసీలకు మన డబ్బులు- మనలెక్కపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రుణాలు సక్రమంగా కట్టకపోవడంతో మండలాన్ని ఉన్నతాధికారులు బ్లాక్ చేశారని తెలిపారు. రుణాలు చెల్లించని పొదుపు గ్రూపులకు నోటీసులు జారీ చేసి మూడునెలలలోగా రికవరీ చేయించాలని సూచించారు. సమావేశం లో ఏపీఎం అంబమ్మ, సీసీలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జున

జూపాడుబంగ్లా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ మల్లికార్జున అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేయరాదని, బాల్య వివాహాలు చేసుకోరాదని వివరించారు. పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకూడదని వివారించారు. రహదారి ప్రమాదాలపై నివారణ మార్గాలను వివరించారు. పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యాయులు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాలోత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని నంబూరులో వీవీఐటీ వారు నిర్వహించిన జాతీయస్థాయి బాలోత్సవం- 2025 పోటీల్లో నంద్యాల గురురాజా పాఠశాల విద్యార్థులు ఏకంగా 47 బహుమతులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విజేతలకు వీవీఐటీ వీసీ వాసిరెడ్డి విద్యాసాగర్, సాహితీవేత్త గజల్ శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో బాషా పరిజ్ఞానం, సాహిత్య అభిరుచిని, విషయ పరిజ్ఞానాన్ని, పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని సదుద్దేశంతో అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇందుకు తల్లిదండ్రుల సహకారంతోనే విజయాలు సాధిస్తున్నామని వివరించారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం

గడివేముల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీఐటీయూ మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల, హమాలీలు స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పోరాటం చేయడంలో సీఐటీయూ కీలకపాత్ర పోషించిందని అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని సుప్రీకోర్టు చెబుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 17, 18 తేదీల్లో బేతంచర్లలో జరిగే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు నాగమణెమ్మ, ఆశా వర్కర్ల మండల అధ్యక్షులు చెన్నమ్మ, అంగన్‌వాడీ మండల అధ్యక్షురాలు వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆలయ ఉద్యోగి మృతి

మహానంది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహానంది దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జీఎం రవి కాంత్(55) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న రవికాంత్‌ను చికిత్స కోసం కుటుంబ సభ్యులు కర్నూలులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. రవికాంత్ మృతికి ఆలయ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం మహానందిలో అంత్యక్రియలు నిర్వహి స్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఏపీ స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ చైర్మన్ పూజలు

మహానంది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో మంగళవారం ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ మధుమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయం ముఖమంటపం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ దంపతులు కార్తీకమాసం పురస్కరించుకొని ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కల్యాణమంటపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం స్వామివారి మోమెంటోను బహుకరించారు. కార్యక్రమంలో నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాల అధినేత గడ్డం రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అనుమానితులపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ సునీల్ షెరాన్
- నంద్యాలలో ప్రధాన ప్రాంతాల్లో తనిఖీలు


రైల్వే స్టేషన్‌లో తనిఖీల్లో పాల్గొన్న ఎస్పీ, సిబ్బంది

నంద్యాల టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయమని, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడుతో మంగళవారం నంద్యాలలో ప్రధాన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండు, లాడ్జీలను ఎస్పీ పరిశీలించారు. ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, ప్రయాణికులు రాకపోకలు సాగించే సమయంలో డిటెక్టర్ మిషన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా నేరాలకు పాల్పడుతున్నట్లు కానీ, అనుమానంగా ఉన్న వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా పోలీసులు పాల్గొన్నారు. అలాగే రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ ఎస్ఐ కుమారి ఆధ్వర్యంలో కూడా బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే గౌరుచరిత

గడివేముల: పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత మంగళవారం జిల్లా పోలీసు అధికారి సునీల్ షెరాన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె పాణ్యం నియోజకవర్గంలో జరుగుతున్న కార్యకలాపాలపై చర్చించారు.

వైద్యానికి అధిక ప్రాధాన్యం

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
- సీహెచ్‌సీలో ఎక్స్‌రే యంత్రం ప్రారంభం


ఎక్స్‌రే యంత్ర విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం ఆమె పాణ్యం సీహెచ్‌సీలో నూతన ఎక్స్‌రే యంత్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గుండె, ఊపిరితిత్తుల రోగులకు ఎక్స్‌రే సౌకర్యం అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరమన్నారు. త్వరలో గైనకాలజిస్టును ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో ఆసుపత్రికి రహదారి, ఎక్స్‌రే, అత్యవసర గుండెపోటుకు ఇచ్చే విలువైన సెమీ ఇంజక్షన్‌లను ఉచితంగా అందిస్తోందన్నారు. ఇప్పటి వరకు పదిమంది గుండెపోటు వచ్చిన రోగులకు అత్యవసర ఇంజక్షన్‌తో ప్రాణాలు కాపాడారని వివరించారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రోగులకు అన్ని వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధి నిధులు ఈ ఏడాది రూ. 5 లక్షలు మంజూరు కాగా దాదాపు రూ. 3లక్షల పనులు చేపట్టినట్లు వైద్యాధికారి వేణుగోపాల్ తెలిపారు. జిల్లాలోని మిడ్తూరు, వెలుగోడు, నందికొట్కూరు, పాణ్యం, యాళ్లూరు, అవుకు, బేతంచెర్ల సీహెచ్‌సీలకు ఎక్స్‌రే సౌకార్యాలు ఏర్పాటు చేసినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ లలిత తెలిపారు. సమావేశంలో తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో
విజయమే లక్ష్యంగా పని చేయాలి

- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


టీడీపీ నూతన కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య నూతనంగా ఎన్నికైన మండలాల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన వారి సేవలను గుర్తించి పదవులను అధిష్ఠానం కట్టబెట్టిందన్నారు. పదవి వచ్చిందంటే మనపై మరింత బాధ్యత పెరిగినట్లు ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు.పదవులు రాని వారు నిరుత్సాహ పడకుండా భవిష్యత్తులో ప్రకటించే పోస్టులకు అర్హులవుతారన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని కోరారు. సమావేశంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి షకీల్ అహ్మద్, నియోజకవర్గ పరిశీలకులు దేవళ్ల మురళి, మండలాల కన్వీనర్లు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, లింగస్వామి గౌడ్, పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు ముర్తుజావలి, హరిసర్వోత్తమరెడ్డి, గిరీశ్వరరెడ్డి, పోతులపాడు రవికాంత్ పాల్గొన్నారు.

త్వరలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు

త్వరలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపినట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. మంగళవారం కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును ఓర్వకల్లు విమానాశ్రయంలో ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి కలిశారు. నియోజకవర్గంలో మొంథా తుపాన్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి పరిహారం చెల్లించాలని, మొక్కజొన్నకు రూ.2400 మద్దతు ధర కల్పించాలని కోరామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

అందెశ్రీ మృతి సాహితీ లోకానికి తీరని లోటు


అందెశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

నంద్యాల రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా కవి, వాగ్గేయకారుడు డాక్టర్ అందెశ్రీ అకాల మరణం సాహితీ లోకానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. మంగళవారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రంగనాయుడు మాట్లాడుతూ.. ఎవరి వద్ద శిక్షణ తీసుకోకుండా తానంతకు తాను పాటల ద్వారా ఎంతో ఎత్తుకు ఎదిగిన మహనీయుడని కొనియాడారు. విప్లవాత్మక సినిమాల్లో వచ్చిన పాటల వెనుక ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. ఆయన ఎన్నో పురస్కారాలు, ప్రశంసలు అందుకున్నారని గుర్తు చేసుకున్నారు.

అందెశ్రీ సంతాప సభ.....

పట్టణంలోని భగత్ సింగ్ గ్రంథాలయంలో అందెశ్రీ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రముఖ న్యాయవాది శంకరయ్య మాట్లాడుతూ.. ప్రజా కవిగా ఎదగడానికి చదువు అవసరంలేదని నిరూపించిన వ్యక్తి అందెశ్రీ అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటాలు మరువలేనివి అన్నారు. కార్యక్రమంలో సర్దార్ హస్మీ జన చైతన్యకళావేదిక నాయకులు చిన్నబాబు, ఉపాధ్యాయుడు నీలకంఠమాచారి, రామ్మూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాగటూరు ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకోని ప్రభుత్వం


ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగటూరు ఎత్తిపోతల పథకాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ ఆరోపించారు. మంగళవారం నాగటూరు ఎత్తిపోతల పథకాన్ని వైసీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నా నాగటూరు లిఫ్ట్ ఇరిగేషన్ సామగ్రి చోరీకి గురైందన్నారు. ఎత్తిపోతల పథకం కింద దాదాపు పదివేల ఎకరాలు భూమి ఉందని సాగునీరు లేక పంటలు వేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

● నందికొట్కూరు మండలంలోని దామగట్ల గ్రామంలో మెడికల్ కాలేజీ పీపీపీ విధానాన్ని వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని డాక్టర్ ధార సుధీర్ చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను వివరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆత్మకూరురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఏడీఈ రామ సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని సబ్ స్టేషన్‌లో ఐదు ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో ఎనిమిది ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దాంతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందన్నారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గడ్డివాము దగ్ధం

పగిడ్యాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పగిడ్యాల గ్రామానికి చెందిన బుజ్జన్నకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా అదుపు కాలేదు. దాంతో కర్నూలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బాధితుడు మాట్లాడుతూ గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు వాపోయాడు. సుమారు రూ. 50వేలు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్తమ పీడీ అవార్డు అందజేత

పాణ్యం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల పీడీ వెంకటేశ్ మంగళవారం అనంతపురం జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు నుంచి ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ అవార్డు అందుకు న్నట్లు ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. జాతీయ విద్యాది నోత్సవం సందర్భంగా యూనివర్సిటీ ఆర్యభట్ట ఆడిటోరియంలో అవార్డు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను కళాశాల ఎండీ శివ రాం, డైరెక్టర్ అశోక్‌కుమార్, పీడీలు చంద్రారెడ్డి, నాయక్ మునీశ్వర్, అధ్యాపకులు అభినందించారు.

సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దు

జూపాడుబంగ్లా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి సర్వేపై సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని వైద్యాధికారి సభా అన్నారు. మంగళవారం జూపాడుబంగ్లాలోని పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్ల సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఈనెల 17నుంచి 30వరకు ప్రతి ఇంటికి వెళ్లి కుష్ఠు నిర్ధారణ లక్షణాలపై సర్వే చేయాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రాముడు, విజయలక్ష్మీ, ఆశా, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

- హాజరుకానున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గోపీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా వినతి రూపంలో తెలియజేయవచ్చన్నారు. కొన్ని అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు.

పాఠశాల తనిఖీ


పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

వెలుగోడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వెలుగోడు శివార్లలోని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను మండల ప్రత్యేక అధికారి హీరా నాయక్, తహసీల్దారు శ్రీనివాస గౌడ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. వంటలు రుచికరంగా ఉన్నాయా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదనపు గదుల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు


నందీశ్వరునికి పూజలు చేస్తున్న ఈవో

శ్రీశైలం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో మంగళవారం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణలోని సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేక ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం క్షేత్రపాలకుడు బయలు వీరభద్రస్వామికి అభిషేకాలు, పుష్పార్చనలు, అష్టోత్తర నామావళి, వీరశైవ ఖడ్గాలతో సాంప్రదాయ పూజలు నిర్వహించారు. అదేవిధంగా ప్రదోషకాల సమయంలో నందిమండపంలో నందీశ్వరునికి పూజలు చేశారు. శనగలు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం కళారాధనలో భాగంగా చిన్నారులు చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

కోటి దీపాలతో శివలింగాకారం


దీపాలంకరణలో పాల్గొన్న భక్తులు

మహానంది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహానంది శైవ క్షేత్రంలో కార్తీకమాసం పురస్కరించుకొని మంగళవారం రాత్రి ఆలయం ప్రాంగణంలో కోటి ఒత్తుల దీపాలతో శివలింగాకారంలో దీపాలు వెలిగించారు. దాతలు ఒంగోలుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త సిద్దా వెంకట సురేష్, శిరీషా దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు మామిళ్లపల్లి రఘుశర్మ వేదమంత్రాలతో కార్తీక దీపోత్సవ పూజలను దాతల చేత నిర్వహించారు. అంతకముందు సమీపంలోని ఉసిరిచెట్టుకు పూజలు జరిపారు.

'ఎస్ఐఆర్ అమలు నిలిపివేయాలి'

ఆత్మకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదకరమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను రాష్ట్రంలో అమలు చేయరాదని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర, ఇస్మాయిల్, వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమిషన్ 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ అమలు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అయితే అందులో మన రాష్ట్రం పేరు లేనప్పటికీ ఎస్ఐఆర్ అమలుకు పూనుకోవడం సరికాదన్నారు. గతంలో టీడీపీ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించి నేడు అమలు చేయాలని ముందుకు రావడం సరికాదన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఎస్ఐఆర్ అమలును వ్యతిరేకించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పగిడ్యాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కన్వీనరు పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ప్రాతకోట గ్రామంలో రైతులు కల్లాలో ఆరబోసుకున్న ధాన్యాన్ని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏడీఏ కార్యాలయం వద్ద చేపడుతున్న నిరసనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ఖాజా భాషా, దివాన్, అమీర్, మోక్షమయ్య, మాలాలి, రఫీ తదితరులున్నారు.

పాములపాడు: రైతులు పండించిన మొక్కజొన్న పంటకు మద్దతుధర కల్పించాలని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అఖిలభారత కిసాన్ మహాసభ నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని రుద్రవరం గ్రామ శివార్లలో ఆరబోసిన మొక్కజొన్న గింజలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నరసింహులు, ఏసన్న, శ్రీరాములు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తులు

నంద్యాల కల్చరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంజనేయకోదండరామస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేణునాథరెడ్డి తెలిపారు. ఈవో మాట్లాడుతూ కమిషనర్ దేవాదాయశాఖ, విజయవాడ వారు ఈనెల 8న నోటిఫికేషన్ జారీచేసినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఒక్కొక్క దేవస్థానానికి 9మంది సభ్యులకు మించకుండా దరఖాస్తులను దేవాదాయశాఖ, జిల్లా దేవాదాయ శాఖ అధికారి నంద్యాల వారి కార్యాలయంనకు ఈనెల 27వతేదీ సాయంత్రం 5గంటల లోపు పంపాలని ఈవో తెలిపారు.

అధిక దిగుబడి సాధించాలి


క్రిమిసంహారక మందులను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

మహానంది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటపై తక్కువ పెట్టుబడి పెట్టి అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం గాజులపల్లిలో మండల వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి అధ్యక్షతన రైతులకు పంటల సాగు విధానంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం రైతులకు క్రిమిసంహారక మందులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపవరం సొసైటీ చైర్మన్ ఉమామహేశ్వరరెడ్డి, ఉద్యానవన శాఖాధికారి నరేంద్ర హరేంద్రతో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు కలర్స్ రవినాథరావు పాల్గొన్నారు.

అధిక ఎరువులు వాడరాదు

నంద్యాల రూరల్: అధిక ఎరువులు వాడడంతో భూసారం తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. మంగళవారం పుసులూరు, బ్రహ్మణపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. మినుము పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బాలలింగమయ్య, రైతుసేవా సిబ్బంది మహేంద్ర పాల్గొన్నారు.

తక్కువ ధరకు విక్రయించొద్దు

జూపాడుబంగ్లా: ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుని మోసపోవద్దని ఏవో కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

సీఎం చంద్రబాబు దృష్టికి సమస్యలు



లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని చంద్రబాబుకు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తీసుకెళ్లారు. మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి ఆళ్లగడ్డ శిల్పులు చెక్కిన అహోబిల లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని ఆయనకు అంజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, రైతుల సమస్యలను ఆమె వివరించారు. నియోజకవర్గ సమస్యలపై సీఎం పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని జాతీయ స్థాయిలో ప్రమోట్ చేయడానికి తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే సీఎంకు వివరించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న పట్నం రాజేశ్వరి

బేతంచెర్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐక్యవేదిక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. మంగళవారం బేతంచెర్ల-కర్నూలు రహదారిలోని గోరుమానుకొండ సమీపంలో ఉన్న ఆదర్శ గురుకుల పాఠశాలలో ర్యాగింగ్ వద్దు.. స్నేహం ముద్దు.. ఆత్మహత్యలు వద్దు - బతికి సాధిద్దాం అనే కార్యక్రమాన్ని ఆర్‌వీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. పట్నం రాజేశ్వరితోపాటు రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ఏపీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగ సురేంద్ర యాదవ్ మాట్లాడుతూ విద్యాసంస్థలలో అనేక కారణాలతో చాలా మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, ఎంఈవో సోమశేఖర్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాస్, కటికె భాను, కన్యాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

చాగలమర్రి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వార్డు, సచివాలయ ఉద్యో గులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో తాహి ర్‌హుసేన్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పెద్దబోదనం సచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. సచివాలయాల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సక్రమంగా నిర్వహించడం లేదని మండిపడ్డారు. ఆయన వెంట కార్యదర్శి రాజేష్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో భాగ్యలక్ష్మి

రుద్రవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కోటకొండ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆమె వెంట హెచ్‌ఎం బాలగురప్ప ఉన్నారు.

సచివాలయం తనిఖీ: మండలంలోని కోటకొండ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో భాగ్యలక్ష్మి తనిఖీ చేశారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఆమె వెంట కార్యదర్శి నరసింహవర్మ ఉన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి

చాగలమర్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో న్యామతుల్లా నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని మల్లేవేముల ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సమ్మెటివ్ పరీ క్షలు పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

టీడీపీ మండల ఉపాధ్యక్షుడిగా ప్రసాద్

ప్యాపిలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల ఉపాధ్యక్షుడిగా కలచట్ల ప్రసాద్, సెక్రెటరీగా నడిగడ్డ నాగేంద్ర నియమి తులయ్యారు. ఈ మేరకు డోన్‌లో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. తమపై నమ్మకంతో పదవులు కట్టబెట్టిన పార్టీ అధిష్ఠానానికి, డోన్ ఎమ్మెల్యే సూర్యప్రకాష్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కోవెలకుంట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి బాలతిమ్మారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏడాది నవంబరులో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులపై ప్రసంగాలు, 18న విద్యార్థులకు పోటీలు, 19న మహిళా సాధికారతపై చర్చ, 20న డిజిటల్ లైబ్రరీ వినియోగంపై స్వీయ పఠనం నిర్వహిస్తామన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కోవెలకుంట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్ సుభాని అన్నారు. మంగళవారం మండలంలోని రేవనూరు పీహెచ్‌సీలో డాక్టర్ సుభాని రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో కొత్త నీరు చేరి జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

హామీలన్నీ నెరవేర్చుతాం

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డోన్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఉన్న డోన్‌ను కర్నూలు జిల్లాలో కలుపుతామని గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాల యంలో ఇటీవల నూతనంగా ఎంపికైన డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లకు ప్రమాణ స్వీకారాన్ని డోన్ నియోజకవర్గ అబ్జర్వర్ కేసీ హరి చేయించారు. డోన్ పట్టణ అధ్యక్షుడిగా టీఈ రాఘవేంద్రగౌడు, మండల అధ్యక్షుడిగా దశరథరామిరెడ్డి, బేతంచెర్ల పట్టణ అధ్యక్షురాలుగా బుగ్గన ప్రసన్న లక్ష్మి, బేతంచెర్ల పట్టణ అధ్యక్షుడిగా ఎల్లనాగయ్య, ప్యాపిలి మండల అధ్యక్షుడిగా మెట్టుపల్లె సుదర్శన్, ప్యాపిలి పట్టణ అధ్యక్షుడిగా కొంగనపల్లి మధుతోపాటు డోన్ మండల జనరల్ సెక్రటరీగా జయన్న యాదవ్, పట్టణ జనరల్ సెక్రటరీగా షేక్ మహ్మద్ రఫీ, బేతంచెర్ల పట్టణ జనరల్ సెక్రటరీగా ఫయాజ్ హుశేన్, మండల సెక్రటరీగా రాజ గోపాల్ రెడ్డిలు, డోన్ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోసానిపల్లె శ్రీరా ములు, నడిగడ్డి నాగేంద్ర, జి.పుల్లయ్యలతో ప్రమాణ స్వీకారం చేయిం చారు. అంతకు ముందుగా దివంగత ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఢిల్లీలో జరిగిన బాంబు పేళ్లలో మృతి చెందిన వారికి రెండు నిమిషాలు పాటించి సంతాపం తెలియజేశారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని అన్నారు.

● **ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు:** పట్టణ ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోట్ల అధికారులకు సూచించారు. పట్టణంలోని పాతపేట పూలమార్కెట్, బేతంచెర్ల సర్కిల్, దొరపల్లె బ్రిడ్జి, మాలిక్‌బాబా ప్రాంతాలో ట్రాఫిక్ సమస్యలు, రైల్వే గేట్ల వద్ద రద్దీ, రహదారి మరమ్మతులు, మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే హరికిషన్, వలసల రామకృష్ణ, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ పెద్ద కేశవయ్య గౌడు, సింగిల్ విండో సొసైటీ చైర్మన్ చిన్నపూజర్ల ఎల్లగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, నాయకులు చంద్రపల్లె లక్ష్మీనారాయణ యాదవ్, సుదాకర్, ప్రభాకర్ రెడ్డి ఓంప్రకాష్, వెంకట నారాయణగౌడు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడు, వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్ పాల్గొన్నారు.

దాహం తీర్చేందుకే శుద్ధజల ప్లాంటు: ఎమ్మెల్యే

ప్యాపిలి: గ్రామస్థుల దాహం తీర్చేందుకే శుద్ధజల ప్లాంటును ఏర్పాటు చేసినట్లు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని బూరుగుల గ్రామంలో రూ.8లక్షలతో నిర్మించిన శుద్ధజల ప్లాంట్‌ను ఆయన ప్రారంబించి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం తాగు, సాగు నీటికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తహసీల్దారు భారతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఈలు ప్రభాకర్‌రెడ్డి, మనోహర్, వై.లక్ష్మీనారాయణ యాదవ్, టీశ్రీనివాసులు, క్రిష్టారెడ్డి, శ్రీరాములు, శివారెడ్డి పాల్గొన్నారు.

ఆలయానికి రూ.2.45 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

బనగానపల్లె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రంలో తలనీలాల వేలం ద్వారా ఆలయానికి రూ.2.45 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి మంగళవారం తెలిపారు. ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో తలనీ లాలు ఏడాది పాటు పోగు చేసుకునేందుకు చాగలమర్రికి చెందిన కోట పాడు నాగేంద్ర అనే వ్యక్తి వేలం పాటలో పాట పాడి దక్కించుకున్నట్లు తెలిపారు.

● యాగంటి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం హుండీ లెక్కింపు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తాత్కాలిక హుండీ లెక్కింపులో ఆలయానికి 93,201 ఆదాయం లభించినట్లు ఏసీ తెలిపారు. కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్ ఈవో బ్రహ్మానందారెడ్డి, యాగంటిపల్లె మౌళీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

దొర్నిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి వెంకటశివ అన్నారు. బుధవారం మండలంలోని దొర్నిపాడు పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ యోజన పథకం కింద గర్భిణులకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం దొర్నిపాడు మానసదేవి ట్రస్టు సభ్యులు భార్గవ్‌శర్మ, శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో గర్భిణులు, మహిళలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు రవికుమార్, విమల, భార్గవ్, సంధ్య, జయశ్రీ, సూపర్‌వైజర్ సాయికృప, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

బనగానపల్లె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ప్రతి ఏటా జాతీయ విద్యాదినోత్సవం జరుపుకుంటున్నారు. ఈసందర్భంగా కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకుడు బడేసాహెబ్‌లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం తొలి విద్యాశాఖామంత్రిగా సేవలందించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకుడు బడేసాహెబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మంగళవారం నివాళి అర్పించారు. అధ్యాపకులు బాలు, విజయరేఖ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు



ప్యాపిలిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

మరువ లేనివని మాయలూరు గ్రామ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షరీఫ్ అన్నారు. మంగళవారం అబుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పార్వతి, ఓబులేసు, మద్దిలేటి, శ్రీనివాసులు, లలిత పాల్గొన్నారు.

డోన్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యాదినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవల గురించి వివరించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **గ్రంథాలయంలో :** పట్టణంలోని గ్రంథాలయంలో మౌలానా అబుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దాదాబాయి, పాఠకులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అబుల్ కలాం అజాద్ విద్యాభివృద్ధికి విశేష సేవలు అందించారన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి నవీన్‌పాటి, రామక్రిష్ణయ్య, ఓబులేసు, మద్దిలేటి, వెంకటరమణ పాల్గొన్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని జీవీఆర్‌ఎస్ డిగ్రీ కాలేజీలో మంగళవారం జాతీయ విద్యాదినోత్సవ కార్యక్రమాన్ని, కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డా.భారి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు



ఉయ్యాలవాడ మండలం మాయలూరులో..



డోన్‌లో..

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం రాత్రి జరిగిన భారీ పేలుళ్ల ఘటనతో జిల్లాలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అనంతపురం-అమరావతి ప్రధాన రహదారిలో కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి వాహనాలను తనిఖీ చేశారు.

నిబంధనలు పాటించాలి: సీఐ

కోవెలకుంట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్ అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో డిగ్రీ కాలేజీ వద్ద సీఐ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్సు, సర్టిఫికెట్లు లేని 14 వాహనాలకు జరిమానా విధించారు. పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు అండగా సీఎం సహాయ నిధి

కొలిమిగుండ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న బాధితులకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని మండల టీడీపీ ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి, పోరెడ్డి చిన్నపురెడ్డి అన్నారు. కొలిమి గుండ్లకు చెందిన మద్దూరు ఓబులేసు అనే వ్యక్తి ఇటీవల గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకొని కోలుకున్న నేపథ్యంలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 1.84లక్షల చెక్కును బాధితుడికి అందజేశారు.

మెరుగైన సేవలందించాలి: కమిషనర్

బేతంచెర్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నగర పాలక కమిషనర్ హరిప్రసాద్ సచివాలయాల సిబ్బం దికి సూచించారు. మంగళవారం పట్టణంలోని 1, 2వ గ్రామ సచివా లయాలను మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.

స్మార్ట్‌కార్డుల పంపిణీ వేగవంతం: తహసీల్దార్

చాగలమర్రి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్మార్ట్‌కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, డీలర్ల సమావేశం నిర్వహించారు. మండలంలో 15,600 కార్డులు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 90 శాతం మాత్రమే పంపిణీ చేశారని అన్నారు. ఇంకా మిగిలిన 10 శాతం కూడా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అబ్దుల్‌సత్తార్, సీనియర్ సహాయకులు దస్తగిరి పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి : ఏపీవో

బేతంచెర్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేదందుకు కృషి చేయాలని ఏపీవో విజయరాణి అన్నారు. మంగళవారం స్త్రీశక్తి కార్యాలయంలో ఏపీఎం మధు అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్లకు, వీవోఏలకు ఉల్లాస్- అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి వలంటరీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈకార్యక్రమం వయోజన విద్యాశాఖ, డీఆర్‌డీఏబీడబ్ల్యూఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణకు కృషి చేయాలి



శిరివెళ్లలో పోస్టర్ విడుదల చేస్తున్న వైద్యులు

శిరివెళ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధి నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని వైద్యులు ముఖేష్ కుమార్, ఆంజనేయులు సూచించారు. ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించడంపై శిరివెళ్ల పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స అందిస్తారన్నారు. అనంతరం వైద్యులు పోస్టర్లను విడుదల చేశారు. సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ సరస్వతి, సూపర్ వైజర్ రవి కుమార్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూకొత్తపల్లె పీహెచ్‌సీలో వైద్యాధికారి నేగల ఉసేన్ ఆధ్వర్యంలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు ఆయా గ్రామాల్లోని వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, వలంటీర్లు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో బాబయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యం

ఆళ్లగడ్డ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఏపీ ఐఐ డైరెక్టర్ స్రవంతి అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్ క్రిష్టాపురంలో ఎంఎస్‌ఎం ప్రోగ్రాంలో భాగంగా ఇండస్ట్రీయల్ పార్కును ప్రారంబించారు. రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన వర్చువల్ ప్రోగ్రాంలో అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఐఐసీ జీఎం బాషా, స్పెషల్ ఆఫీసర్ హరిగోపాల్, ఎంపీడీవో నూర్జాహన్, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, టీడీపీ మండల కన్వీనర్ శీలం హరికుమార్‌రెడ్డి, క్రిష్టాపురం మాజీ సర్పంచ్ రఘురామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ హఫీజ్, టీడీపీ నాయకులు వెంకట శివారెడ్డి, మర్రిపల్లె పాపిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతులకు నివాళి

డోన్ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎర్రకోట వద్ద ఉగ్రవాదులు జరిగిన జరిగిన బాంబుపేలుళ్లలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ డోన్ బీజేపీ అసెంబ్లీ పట్టణ అధ్యక్షుడు బద్రి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు సంధు వెంకటరమణ నివాళులర్పించారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ స్థాయి కార్యాలయంలో బద్రి సుధాకర్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించి మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించి వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ హింసాత్మక ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, రవికుమార్, విజయభాస్కర్, పాశం వెంకటరంగారెడ్డి సుబ్రహ్మణ్యం, కమలేష్ పాల్గొన్నారు.

బనగానపల్లె వాసికి అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటరాముడు శాస్త్రి

బనగానపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్యోతిష్య పండితుడు కటారు వెంకటరాముడు శాస్త్రికి బహ్మర్షి జ్యోతిష్య భూషణ్ అవార్డు మంగళవారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడి యం సమీపంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఈయనకు ఈ అవార్డు లభించింది. సూర్యచంద్ర సంస్థ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ అవార్డు ఆయన అందుకున్నారు. మంగళవారం వెంకటరాముడు మాట్లాడుతూ జ్యోతిష్య శాస్త్రంలో ఎంతో పేరు సంపాదించుకున్న వ్యక్తులకు ఈ అవార్డు ఇస్తారని, తనకు అవార్డు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

శివయ్యకు అరటిపండ్ల అలంకరణ



చాగలమర్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం మహిళలు సామూహికంగా అరటిపండ్లతో ఈశ్వరస్వామిని అలంకరించారు. విష్ణుసహస్ర పారాయణం, శివపార్వతుల పల్లకి ఉత్సవం చేశారు. ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి: సీపీఐ



మాట్లాడుతున్న రంగనాయుడు

డోన్ రూరల్ నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మండల మహిళా సమైఖ్యలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యు డు సుంకయ్య, పట్టణ, మండల కార్యదర్శులు మోటరాముడు, నారా యణ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్యాపిలి మండలం మెట్టుపల్లె గ్రామంలో రూ.11 లక్షలు స్వాహాపై, డోన్, ప్యాపిలి మండలాల్లో ఉల్లాస్ నిధుల స్వాహాపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

రుద్రవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దారు ధోనీ ఆల్‌ఫ్రెడ్ మంగళవారం తనిఖీ చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం ఎలా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

రుద్రవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17, 18 తేదీల్లో బేతంచెర్లలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లాకార్యదర్శి రామచంద్రుడు పిలుపునిచ్చారు. మంగళవారం రుద్రవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశా కార్యకర్తలతో సమావేశమయ్యారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు.